@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || శుక్రవారం 16, ఫిబ్రవరి 2024 || పేజీలు: 04




## ఎన్నికల బాండ్లు
# రాజ్యాంగ విరుద్ధం

- ఆ పథకాన్ని వెంటనే నిలిపేయాలి
- దాత, గ్రహీత, విరాళం వివరాలు బహిర్గతపరచాల్సిందే
- కంపెనీలు, వ్యక్తులను ఒకేలా చూడటం సరికాదు
- విరాళాలు విధానాలను ప్రభావితం చేస్తాయి
- ఇది 'క్విడ్ ప్రో కో' లాంటిదే
- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఫిబ్రవరి 15:**

**లోక్‌సభ ఎన్నికల ముంగిట** సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎలక్టోరల్ బాండ్లను రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ ఆ పథకాన్ని కొట్టివేసింది. రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు, సమాచార హక్కు చట్టానికి ఎలక్టోరల్ బాండ్లు వ్యతిరేకమని పేర్కొంది. ఈ పథకం కింద ఇప్పటి వరకూ బాండ్లను కొనుగోలు చేసిన వారి పేర్లు, ఆ బాండ్ల విలువ, వాటిని స్వీకరించిన వారి వివరాలను వెల్లడించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎలక్టోరల్ బాండ్లను విక్రయించే ఎస్‌బీఐని.. 2019 ఏప్రిల్ 12 నుంచి విక్రయించిన బాండ్ల వివరాలను మార్చి 6వ తేదీలోపు ఎన్నికల సంఘానికి (ఈసీకి) సమర్పించాలని, మార్చి 13లోపు ఆ వివరాలను ఈసీ తన వెబ్‌సైట్‌లో బహిరంగపరచాలని ఆదేశించింది. నగదుగా మార్చని బాండ్లను కొనుగోలుదార్ల ఖాతాల్లో తిరిగి జమ చేయాలని ఎస్‌బీఐకి ఆదేశాలు జారీ చేసింది. 232 పేజీలతో కూడిన రెండు వేర్వేరు తీర్పులను ధర్మాసనం వెలువరించింది.

రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. రహస్యంగా మిగతా 2లో..





## రూ.100 కోట్లతో
# గురుకులం!

- 20 ఎకరాల్లో నిర్మాణం.. నియోజకవర్గానికి ఒకటి చొప్పున..
- నమూనాగా కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులం
- 3,650 రోజులు అధికారంలో ఉండి నియామక పత్రాలివ్వలేదే?
- పదేళ్లలో కేసీఆర్ చేతికి రూ.17.50 లక్షల కోట్లు
- గురుకులాల టీచర్ల నియామక పత్రాల పంపిణీలో సీఎం రేవంత్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 15:**

"రాష్ట్రంలో అద్దెభవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మిస్తాం. అన్ని వసతులను కల్పిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను కలిపి.. నియోజకవర్గానికి ఒకటిగా ఇంటిగ్రేటెడ్ గురుకులంగా నిర్మిస్తాం. ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని 20 ఎకరాల్లో.. రూ.100 కోట్లతో ఏర్పాటు చేస్తాం" అని ముఖ్యమంత్రి మిగతా 2లో..

## బీసీ కుల గణనపై నేడు
# అసెంబ్లీలో తీర్మానం

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్ఃఫిబ్రవరి 15:**


తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఎనిమిదవరోజు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం బీసీ కుల గణనపై తీర్మానం ప్రవేశ పెట్టనుంది. దీనిని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టనున్నారు. అలాగే ఇరిగేషన్‌పై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయనుంది. దీనిపై సభలో మిగతా 2లో..

# అప్పుల కుప్ప

- ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రుణాలు..
- 2022 మార్చి నాటికే రూ.4.33 లక్షల కోట్ల అప్పు
- జీఎస్‌డీపీలో ఈ అప్పు వాటా 38 శాతం
- దళిత బంధుకు రూ.3,442 కోట్ల అధిక వ్యయం
- రుణ మాఫీ, డబుల్ ఇళ్లకు కేటాయించినా డబ్బుల్లేవు
- ఎంబీసీ కార్పొరేషన్ 500 కోట్లలో పైసా ఖర్చు కాలేదు
- గత ప్రభుత్వ పనితీరును ఎండగట్టిన కాగ్
- అసెంబ్లీలో 2021-22 సంవత్సరపు నివేదిక సమర్పణ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 15:**

తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని 'కాగ్' ఆక్షేపించింది. బడ్జెట్ అప్పులు, బడ్జెట్ వెలుపల కార్పొరేషన్లకు గ్యారెంటీ ఇచ్చిన అప్పులు కలిపి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించిపోయాయని వెల్లడించింది. గ్యారెంటీ అప్పుల విషయంలో పారదర్శకత లోపించిందని, మిగతా 2లో..





# ఇది ప్రజా ప్రభుత్వం

- ప్రజలకు సేవచేయడమే మా లక్ష్యం
- తెలంగాణలో ఆర్థిక, సామాజిక అసమానతలున్నాయి
- అసమానతలు తొలగించేదుకు బడ్జెట్ ద్వారా కృషి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి15:**


తెలంగాణలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఉన్నాయ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు తొలగించేదుకు బడ్జెట్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని.. ప్రజలకు సేవచేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సామాజిక సమానత్వంలో భాగంగా బడ్జెట్‌లో కేటాయింపు చేశామని ఆయన తెలిపారు. మిగతా 2లో..

# బస్సుల్లో పెరిగిన రద్దీ

- మహాలక్ష్మి పథకంతో కిక్కిరిసిపోతున్న బస్సులు
- టీఎస్ ఆర్టీసీలో మెట్రో తరహా సీట్లకు కసరత్తు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి15:**

తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. తెలంగాణలో గతంలో రోజూ 11 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించేవారు. ప్రస్తుతం ఈ సంఖ్య దాదాపు రెండింతలైంది. మిగతా 2లో..





# ఘనంగా సద్గురు శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

మిర్యాలగూడ (నేటి ఫోకస్ న్యూస్) ఫిబ్రవరి 15:



సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవము. అతను హిందూ ధర్మం గొప్ప తనం బంజారాలకు తెలియజేయ డానికి జన్మించిన మ హానుభావు నిగా భావిస్తారు. సేవాలాల్ మహ రాజ్ జయంతి పురస్కరించుకుని ఫిబ్రవరి 15న సెలవు దినంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. తెలం గాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవా లాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా నిర్వహించిన మహా భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న మిర్యాలగూడ శాసనసభ్యులు గౌ,, శ్రీ బత్తుల లక్ష్మారెడ్డి తనయుడు యువ నాయకులు బత్తుల ఈశ్వర గణేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మరియు బి.యల్.ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



# వంద రోజులు కావస్తున్న ఎక్కడి హామీలు అక్కడే..

- ఇచ్చిన హామీలు అమలు గడువులోగా పూర్తి చేయాలని డిమాండ్
- బిఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రతినిధి నేటి పోకస్ న్యూస్ చారకొండ వెంకటేష్ ఫిబ్రవరి 15:

కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు మార్చి 17వ. తేదీతో ఈ ప్రభుత్వానికి వందరోజుల గడువు పూర్తి అవుతుందని, ఆలోగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ శాసనసభ్యుడు గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందనీ, ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు వేరు, ఇప్పుడు అవలంబిస్తున్న తీరువేరని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. గత ఐదు రోజుల క్రితం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన సంఘటన దురదృష్టకరమని, ఘటనకు కారణమైన ప్రభుత్వం వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పి తీరాలన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తే రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు పునరావృతం కావన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కుల గణనపై నేడు అసెంబ్లీలో తీర్మానం

(మొదటి పేజీ తరువాయి..)

స్వల్ప కాలిక చర్చ జరుగుతుంది. ఇరిగేషన్‌పై అధికార ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా చర్చ జరిగే అవకాశ ముంది. కాగా నిన్న (గురువారం) సభలో కాగ్ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కాగ్ రిపోర్టులో సయితం కాళేశ్వరంపై అనేక ఆరోపణలు ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగినట్లు కాగ్ ప్రస్తావించింది. ఈరోజు ఇరిగేషన్ చర్చలో ప్రధాన అస్త్రంగా కాగ్ రిపోర్ట్ మారనుంది. మేడిగడ్డ కుంగిన విధానంపై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేయనుంది. కాగా ఈ రోజుతో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి.

# బస్సుల్లో పెరిగిన రద్దీ

(మొదటి పేజీ తరువాయి..)

18-20 లక్షల మంది రోజు తెలంగాణలోని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీ చాలా ఎక్కువగా ఉంటోంది. ఆసమయంలో ఉద్యోగుల, విద్యార్థులు ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. సోమ, బుధవారం మరింత రద్దీ ఉంటోందని గణాంకలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బస్సు నిండా సీట్లుంటే ఎక్కువ మంది ప్రయాణించడానికి అవకాశం ఉండటంలేదు.ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. బస్సుల్లోని కొన్ని సీట్లు తొలగించాలని భావిస్తోంది. దీంతో మరింత మంది ప్రయాణం చేసే అవకాశం ఉంటుందని యోచిస్తోంది. బస్సు మధ్యలో ఉన్న ఆరు సీట్లు తొలగించి మెట్రో రైలు మాదిరి సీటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. అప్పుడు నిలబడి కూడా ఎక్కువ మంది ప్రయాణించడానికి వెసులుబాటుగా ఉంటుందని యోచిస్తున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని రూట్స్‌లో బస్సుల సీటింగ్ మార్చింది. సిటీ బస్సుల్లో ప్రస్తుతం 44 సీట్లున్నాయి. 63 మంది ప్రయాణిస్తే 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చేది. మహాలక్ష్మి అమలు తర్వాత మహిళా ప్రయాణికులు బాగా పెరిగారు. కండక్టర్ టికెట్లు జారీ చేయడం కూడా కష్టంగా ఉంది. ఈ సమస్యలకు పరిష్కారం సీటింగ్ వ్యవస్థను మార్చడమేనని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఆరు సీట్లు తొలగిస్తే.. బస్సుకు ఇరువైపులా మెట్రో మాదిరి 5 సీట్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇలా 10 సీట్లు ఏర్పాటు చేస్తే గతంతో పోలిస్తే రెండు సీట్లు తగ్గుతాయన్నారు. రద్దీ ఎక్కువున్న మార్గాల్లో కొన్ని బస్సులకు సీటింగ్ వ్యవస్థ మార్చామని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు చెప్పారు.

# ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి..)

విరాళాలు ఇవ్వడానికి వీలుకల్పించే ఈ పథకం- సమాచార హక్కును ఉల్లంఘించడమే కాకుండా, రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం కింద పేర్కొన్న భావప్రకటన స్వేచ్ఛకు విరుద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. దీనిని వెంటనే నిలిపివేయాలంది. విరాళాలిచ్చినవారి పేర్లు రహస్యంగా ఉంచడం వల్ల ఆదాయపు పన్ను చట్టాన్ని కూడా ఉల్లంఘించినట్లు అవుతుందని తెలిపింది. రాజకీయ పార్టీలకు అపరిమితంగా విరాళాలు ఇవ్వడానికి వీలుగా కంపెనీల చట్టంలోని సెక్షన్ 182(1)లోని నిబంధనను తొలగించడం ఆర్టికల్ 14కి విరుద్ధమని వ్యాఖ్యానించింది. డబ్బు ప్రభావం ఎన్నికల ఫలితాల వరకే పరిమితం కాకుండా ప్రభుత్వ నిర్ణయాలపైనా పడుతుందని పేర్కొంది. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత కూడా నిధులు ఇస్తుండడం వల్ల 'నీకు ఇది.. నాకు అది' (క్విడ్ ప్రో కో) తరహాలో కొందరు లబ్ధిపొందడానికి ఆస్కారం ఎక్కువగా ఉంటుందని విశ్లేషించింది. బాండ్ల ముసుగులో అధికార పార్టీలు నిధుల కోసం ప్రజలపై, సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చే అవకాశం ఉందంది. సార్వత్రిక సమరానికి ముందు వెలువడిన ఈ తీర్పు చరిత్రాత్మకమైనదంటూ వివిధ రాజకీయ పక్షాలు హర్షం వ్యక్తంచేశాయి. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఎన్నికల బాండ్ల ప్రక్రియ ఉందని పేర్కొంటూ 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్' (ఏడీఆర్), సీపీఎం, కాంగ్రెస్ నేత జయా ఠాకుర్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతోకూడిన రాజ్యాంగ ధర్మాసనం గురువారం 232 పేజీల తీర్పును ఏకగ్రీవంగా వెలువరించింది. నలుగురు న్యాయమూర్తుల తరఫున 152 పేజీల్లో ప్రధాన తీర్పును సీజేఐ రాయగా, వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తూనే జస్టిస్ సంజీవ్‌ఖన్నా విడిగా తీర్పు ఇచ్చారు. విధానం రాజ్యాంగ విరుద్ధమైనదిగానే వారంతా ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం బాండ్లను ప్రారంభించడానికి ముందే ఈ పథకంపై సమగ్ర విచారణ అవసరమని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. గతేడాది అక్టోబరులో విచారణ జరిపిన న్యాయస్థానం అప్పుడు తీర్పును రిజర్వు చేసి ఇప్పుడు వెలువరించింది. మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ ఈ తీర్పు రాజకీయ పార్టీలపై గట్టి ప్రభావం చూపించనుంది. ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు అందిన విరాళాలను వెల్లడించాలని 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. ఎన్నికల బాండ్లు జారీచేసిన ఎస్‌బీఐ..ఆ తేదీ తర్వాత రాజకీయ పార్టీలకు అందిన విరాళాల వివరాలన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోపు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. వీటిని ఎన్నికల సంఘం మార్చి 13లోపు తన వెబ్‌సైట్‌లో ఉంచాలని స్పష్టంచేసింది. పార్టీల నిధుల సమాచారం ఓటర్లకు అందుబాటులో ఉంటే విధాన నిర్ణయాలు, ఆర్థిక విరాళాల మధ్య ఉన్న సంబంధాన్ని వారు అంచనా వేసుకోగలుగుతారంది. ఈ పథకం కింద ఇప్పటివరకు 30 విడతల్లో దాదాపు 28వేల బాండ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విక్రయించింది. వీటి మొత్తం విలువ రూ.16,518 కోట్లు. ఒక పార్టీకి అందిన విరాళాల సమాచారం ఓటర్లకు తెలియాలని, సమర్థంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అది అవసరమని సీజేఐ పేర్కొన్నారు. ఎవరు విరాళాలిచ్చారో పార్టీలకు తెలిసే అవకాశం లేదన్న కేంద్రం వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. పథకంలో కొంత లోపభూయిష్టత ఉందని, దానివల్ల వారి వివరాలను తెలుసుకోవచ్చని స్పష్టం చేసింది. "రాజ్యాంగ పీఠికలో భారత్‌ను ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా (డెమొక్రటిక్ రిపబ్లిక్) పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పౌరులందరికీ రాజకీయ సమానత్వం ఉంటుంది. ప్రతి ఒక్కరి ఓటు విలువా సమానమే. ప్రజాస్వామ్యం అన్నది ఎన్నికలతో మొదలై ఎన్నికలతో అంతంకాదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ముఖ్యమే. ప్రజాప్రతినిధుల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తంచేసే అవకాశాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రజలకు కల్పిస్తోంది. ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి నిబద్ధతతో కూడిన ఎన్నికల ప్రక్రియ చాలా ముఖ్యం. ప్రజాస్వామ్యం మనుగడ సాగించడానికి స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించడం చాలా ముఖ్యమని కోర్టు నిరంతరం చెబుతూ వస్తోంది. పార్టీలకు ఇచ్చే విరాళాలపై పరిమితిని విధిస్తూ 1985లో చేసిన సవరణ ద్వారా కంపెనీల చట్టంలో సెక్షన్ 293-ఏ చేర్చారు. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో వచ్చిన నికర లాభ సగటులో 5% వరకే విరాళాలు ఇచ్చేందుకు అందులో వీలు కల్పించారు. నష్టాల్లో ఉన్న కంపెనీలు, డొల్ల (షెల్) కంపెనీలు విరాళాలు ఇవ్వకుండా చూడటానికే ఈ నిబంధన రూపొందించారు. ఇలాంటి కంపెనీల ఏర్పాటును నిరుత్సాహపరచడానికే తాజాగా కంపెనీల విరాళాలపై పరిమితిని తొలగించినట్లు సొలిసిటర్ జనరల్ చేసిన వాదన ఆమోదయోగ్యంగా లేదు. కేంద్ర ప్రభుత్వం 2017లో కంపెనీల చట్టంలోని సెక్షన్ 182కి సవరణ చేసిన తర్వాత కంపెనీలు కూడా సాధారణ వ్యక్తుల తరహాలోనే అపరిమిత మొత్తంలో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి తలుపులు తెరచుకున్నాయి. వ్యాపారాలను మెరుగుపరిచేలా రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేయడమే కార్పొరేట్ విరాళాలకు ముఖ్య కారణం. కేంద్రం చేసిన సవరణ ద్వారా ఏ కంపెనీ అయినా ఎలాంటి జవాబుదారీతనం లేకుండానే తన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ద్వారా రాజకీయ పార్టీలకు అపరిమితంగా విరాళాలు ఇవ్వడానికి వీలుపడుతోంది. రాజకీయ విరాళాల ద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే శక్తి ఒకవ్యక్తి కంటే కంపెనీకి చాలా ఎక్కువ ఉంటుంది. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల పరిమాణం పరంగా చూసినా, ఆ విరాళం వెనుక ప్రయోజనాన్ని చూసినా రాజకీయ ప్రక్రియపై కంపెనీల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. వ్యక్తులు రాజకీయపార్టీల పట్ల ఉన్న అభిమానం, అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని విరాళాలు ఇస్తారు. కంపెనీలు మాత్రం కేవలం వ్యాపార లావాదేవీలను దృష్టిలో ఉంచుకొని, తిరిగి లాభాలు పొందడానికే ఇస్తాయి. అందువల్ల రాజకీయ విరాళాల విషయంలో కంపెనీలు, వ్యక్తులను ఒకేలా చూడకూడదు. నష్టాల్లో ఉన్న కంపెనీలు పన్ను ప్రయోజనాల కోసం కాకున్నా క్విడ్ ప్రో కో ఒప్పందం కింద రాజకీయ పార్టీలకు విరాళాలు ఇస్తాయన్న ఉద్దేశంతో చట్టంలో ఆ తేడా చూపారు. లాభాలు, నష్టాల్లో ఉన్న వాటిగా కంపెనీలను విడదీసి చూడకుండా సెక్షన్ 182కి సవరణ చేయడం, దాని కింద కంపెనీలను వ్యక్తులతో సమానంగా చూడటం అన్నది ఏకపక్షం. ఎందుకంటే స్వేచ్ఛాయుత, న్యాయబద్ధమైన ఎన్నికలకు వారు చేసే కీడులో తేడా ఉంటుంది" అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేసేందుకు పౌరులందరికీ సమాన స్వరం ఉండాలి. ఆర్థిక అసమానతలు విభిన్న రాజకీయ అసమానతలకు దారితీస్తాయి. డబ్బు- రాజకీయాల మధ్య లోతైన బంధం ఉండటమే అందుకు కారణం. ఒక రాజకీయపార్టీకి ఇచ్చే విరాళం 'క్విడ్ ప్రో కో'కు దారి తీయడానికి అవకాశం ఎక్కువ. అది విధాన నిర్ణయాల్లో మార్పు కావొచ్చు... లేదంటే విరాళం ఇచ్చిన వ్యక్తికి లైసెన్స్‌లు మంజూరు చేయడం కావొచ్చు.

# ఇది ప్రజా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి..)

గతంలో ఏటా బడ్జెట్‌ను 20 శాతం పెంచుకుంటూ పోయారన్నారు.గత ప్రభుత్వం రాజస్థాన్‌లో బడ్జెట్ కంటే అధికంగా ఖర్చు పెట్టారని ఆయన తెలిపారు. రాజస్థాన్‌లో రూ.2.5 లక్షల కోట్లు బడ్జెట్ పెడితే గత ప్రభుత్వం రూ.2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గతంలో మాదిరిగా 20 శాతం అధికంగా బడ్జెట్ పెడితే ప్రమాదంగా



మారుతుందన్నారు. రాష్ట్రంపై ప్రస్తుతం మొత్తం రూ. 7.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉందన్నారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు పూర్తి చేస్తామని భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా 16 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం పూర్తిగా అభద్దాలతో బడ్జెట్ ను ప్రవేశపెట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే బతుకులు బాగుపడతాయని ప్రజలు భావించారని భట్టివిక్రమార్క అన్నారు. కానీ గత పాలకులు హామీలు అమలు చేయకపోవడం వల్ల అలాగే ఉండిపోవాల్సి వచ్చిందన్నారు.

# అప్పుల కుప్ప

(మొదటి పేజీ తరువాయి..)

చివరికి వీటిని ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేసింది. కార్పొరేషన్లకు ఎలాంటి ఆదాయం లేకపోయినా వాటి ద్వారా అప్పులు తీసుకుని, రాష్ట్ర ప్రభుత్వమే వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితిని తప్పుబట్టింది. 2019 నవంబరు లోపు ఇలాంటి అప్పుల నుంచి బయటపడాలని 15వ ఆర్థిక సంఘం చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేసింది. రెవెన్యూ లోటు పెరిగి పోయిందని, కొన్ని ప్రభుత్వ పథకాలకు కేటాయించిన మేర నిధులను ఖర్చు పెట్టలేదని కాగ్ చెప్పింది. వడ్డీల భారం పెరిగిపోయిందని, బడ్జెట్ అంచనాలు, వాస్తవ వ్యయాల మధ్య అంతరం భారీగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించికంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రూపొందించిన నివేదికలను గురువారం రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు 'ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ(ఎఫ్ఆర్‌బీఎం)' చట్టం పరిమితిని దాటిపోయాయని 'కాగ్' వెల్లడించింది. రాష్ట్ర సొంత రుణాలు రూ.3,14,663 కోట్లు ఉంటే, కార్పొరేషన్లకు హామీ ఇచ్చిన రుణాలు రూ.1,18,955 కోట్లు కలిపి మొత్తం రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.4,33,618 కోట్లకు చేరుకున్నాయని చెప్పింది. స్థూల రాష్ట్ర ఉత్పత్తి రూ.11,48,115 కోట్లలో అప్పులవాటా 37.77 శాతమని ప్రస్తావించింది. ఇది ఎఫ్ఆర్‌బీఎం విధించిన 25 శాతం పరిమితిని అతిక్రమించడమేనని స్పష్టం చేసింది. 15వ ఆర్థిక సంఘం ఇచ్చిన 29.30 శాతం వెసులుబాటు కన్నా కూడా ఇది చాలా ఎక్కువని చెప్పింది. బడ్జెటేతర రుణాల వల్లే పరిస్థితి ఇలా అదుపు తప్పిందని వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ నుంచి సేకరించిన రుణాల్లో 74 శాతాన్ని మాత్రమే మూలధన వ్యయం కింద ఖర్చు పెట్టిందని వెల్లడించింది. 2018-19 నుంచి మూడేళ్లుగా మూలధన వ్యయం కన్నా మార్కెట్ రుణాలే ఎక్కువగా ఉన్నాయని కాగ్ గుర్తించింది. ద్రవ్య లోటులో మార్కెట్ నుంచి తీసుకున్న రుణాల ద్వారానే 79 శాతం వరకు భర్తీ అయిందని గుర్తించింది.

పన్నేతర రాబడులు, సహాయక గ్రాంట్లను అధికంగా అంచనా వేశారని అవేవీ ఖర్చు కాలేదని కాగ్ గుర్తించింది. బడ్జెట్ అంచనాలకు మించి రూ.2,63,092 కోట్లు ఖర్చయినట్లు చెబుతున్నా చేబదుళ్లను పక్కనబెడితే వాస్తవంగా అయిన ఖర్చు రూ.1,95,818 కోట్లేనని తెలిపింది. ఇది బడ్జెట్ అంచనాల్లో 77 శాతమేనని వెల్లడించింది. సేవా పింఛన్ల కింద రూ.5046 కోట్లు, దళిత బంధు కింద రూ.3,442 కోట్లు, కుటుంబ పింఛన్ల కింద రూ.1,929 కోట్లు, రాష్ట్ర అభివృద్ధి రుణాల వడ్డీ కింద రూ.1,785 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చేసిన అధిక వ్యయాలుగా కాగ్ తప్పు పట్టింది.

కొన్ని పథకాలకు నిధులు లేని కారణంగా బడ్జెట్ కేటాయింపుల కంటే తక్కువ వ్యయం చేసినట్లు కాగ్ గుర్తించింది. రైతు రుణ మాఫీ(రూ.4,462 కోట్లు), గ్రామీణ పేదలకు రెండు గదుల ఇళ్ల నిర్మాణం(రూ.4,270 కోట్లు), పట్టణ పేదలకు రెండు గదుల ఇళ్ల నిర్మాణం(రూ.4,035 కోట్లు), సంక్షేమ అభివృద్ధి కార్యకలాపాల ప్రత్యేక అభివృద్ధి నిధి(రూ.3,898 కోట్లు) చొప్పున నిధులు తగ్గడంతో ఖర్చు పెట్టలేక పోయినట్లు తెలిపింది. ఎంబీసీ సంస్థకు కేటాయించిన రూ.500 కోట్లలో పైసా ఖర్చు కాలేదని గుర్తించింది. 2022 మార్చి నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు మీద రూ.86,788 కోట్లను వ్యయం చేయగా... అందులో కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం సంబంధిత నిధులే రూ.55,808 కోట్లు అని వివరించింది. 2021-22లో కార్పొరేషన్‌కు అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.1,422 కోట్లను రుణ రూపంలో, పెట్టుబడుల రూపంలో మరో రూ.3,072 కోట్లను అందజేసిందని తెలిపింది. దీనిని బట్టి కార్పొరేషన్ రుణాలను చెల్లించే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనన్న విషయం రూఢీ అవుతుందని పేర్కొంది. 14 ఏళ్లలో కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో ప్రభుత్వమే రూ.1,41,544 కోట్లను చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. ఇవి కాక నీళ్లు పోయడానికి విద్యుత్తు చార్జీల కింద ఏడాదికి రూ.10,375 కోట్ల చొప్పున 12 ఏళ్లలో రూ.1,24,495 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది.

# రూ.100 కోట్లతో గురుకులం!

(మొదటి పేజీ తరువాయి..)

రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురుకుల ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు గురువారం ఆయన ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, సీఎస్ శాంతికుమారి పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇంటిగ్రేటెడ్ గురుకుల క్యాంప్‌సలలో కలిసి చదువుకుంటే.. వారంతా తాము వేర్వేరు కాదనే వాతావరణంలో.. సోదర భావంతో మెలుగుతారని అభిప్రాయపడ్డారు. అలాంటి సోదర భావంతో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవుతారని ఆకాంక్షించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి స్థలాలను అన్వేషించాలని సీఎసను ఆదేశించారు. "విద్యకు పెట్టేది ఖర్చు కాదు. అది భవిష్యత్ నిర్మాణానికి పెట్టుబడి. టీచర్ల నియామకం అంటే.. దేశాన్ని బలోపేతం చేసే క్రతువుకు పెట్టుబడి" అని వ్యాఖ్యానించారు. ఉద్యోగ నియామక పత్రాలు పొందిన వారంతా.. బాధ్యతతో విద్యను బోధించాలని సూచించారు. "త్వరలోనే 561 గ్రూప్-1 పోస్టులకు పరీక్షలను నిర్వహిస్తాం. ఫలితాలను వెల్లడిస్తాం. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ.. నియామకాలు చేపడుతున్నాం. అందులో భాగంగానే 1,997 గురుకుల ఉద్యోగాలకు నియామక పత్రాలను అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లోనే.. స్టాఫ్ నర్స్, సింగరేణి, పోలీసు, గురుకుల టీచర్లతో కలిపి.. దాదాపు 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం" అని రేవంత్‌రెడ్డి వివరించారు. 3,650 రోజులు అ౽ధికారంలో ఉండి కూడా ఉద్యోగ నియామకాలను ఎందుకు జరపలేదని బీఆర్ఎసను నిలదీశారు. "విద్య కోసం గత ప్రభుత్వం 6 శాతమే ఖర్చు చేసింది. మా సర్కారు విద్యకు 10-12% నిధులను పెంచింది. గత ప్రభుత్వం మారుమూల పల్లెలు, తండాల్లో ఉన్న 6,450 ఏకోపాధ్యాయ బడులను రేషనలైజేషన్ పేరుతో మూసివేసింది. బడులను రేషనలైజ్ చేస్తే.. పేదవారు పక్క గ్రామాలకు వెళ్లి ఎలా చదువుకుంటారు? బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో.. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను కూడా తెచ్చుకోలేకపోతున్నారు. ఆ కారణంగానే వనపర్తిలో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో.. విద్యార్థులకు ఎందుకు వసతులను కల్పించలేదు? కానీ, కేసీఆర్ చేతికి మాత్రం గడిచిన పదేళ్లలో రూ.17.50 లక్షల కోట్లు వెళ్లాయి" అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి కుర్చీలో తన కొడుకు కుర్చోలేదన్నదే కేసీఆర్ బాధ అని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కొడుకు కోసమే సచివాలయాన్ని కూల్చి.. వాస్తు ప్రకారం కొత్త సెక్రటేరియట్‌ను నిర్మించారన్నారు. "కేసీఆర్ వాస్తు ప్రకారం నిర్మించుకున్న సచివాలయం ఇపుడు మాకు, తెలంగాణ ప్రజలకు పనికొస్తోంది. దశ-దిశ అని కొన్ని ఉంటాయి. దశ బాగుంటే.. దిశతో సంబంధం ఉండదు. దిశ బాగోలేదు కాబట్టే కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సర్కారు సృష్టించిన సమస్యలను పరిష్కరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుంటే.. అది తట్టుకోలేక మామాఅల్లుళ్లు, తండ్రీకొడుకులు వీధుల వెంట తిరుగుతున్నారని రేవంత్ విమర్శించారు. తాము నియమకాలను చేపడుతుంటే.. మరొకాయన మాట్లాడుతూ.. చేతగాకపోతే దిగిపోవాలంటున్నారని.. తనకు పదవి ఇస్తే చేసి చూపిస్తానని సవాల్ చేస్తున్నారని హరీశ్‌రావును ఉద్దేశించి అన్నారు. ఔరంగజేబు వెన్నుపోటు గురించి ప్రస్తావిస్తూ.. హరీశ్ మరో ఔరంగజేబు అవతారం ఎత్తాల్సిందేనన్నారు. పదేళ్లు ఆర్థిక, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు.. అపుడు ఏం చేశారని నిలదీశారు. "వాళ్లు కట్టిన మేడిగడ్డ పేకమేడలా కూలిపోయింది. లక్ష కోట్లు ఖర్చు చేసి.. లక్ష ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదు. అందుకు సంబంధించిన కాగ్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టాం. దాన్ని అందరూ చదవాలి. ఇంత దుర్మార్గమైన దోపిడీని ప్రపంచంలోనే ఎవరూ చూడలేదు. మేడిగడ్డ కూలిపోయిన విషయాన్ని తెలంగాణ సమాజం చూడకుండా పోలీసు పహారా మధ్య నిర్బంధించారు." అని ఆరోపించారు.

# మే 17వ తేదీన పాలిసెట్ రాతపరీక్ష


నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి15: టీఎస్ పాలిసెట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు లేదా ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పాలిసెట్ రాతపరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 22. ఎస్సీ, ఎస్టీలు రూ. 250, ఇతరులు రూ. 500 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రూ. 100 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 24 లోపు, రూ. 300 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 26వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవచ్చు. మే 17వ తేదీన పాలిసెట్ రాతపరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహించిన 12 రోజులకు ఫలితాలను వెల్లడించనున్నారు.

# పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

◆ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ ఫిబ్రవరి 15:**

నాగర్ కర్నూలు జిల్లా పార్లమెంట్ ఎన్నికలను పారదర్శంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలోని సాంకేతిక నిపుణులు తమ నైపుణ్యం పెంచుకోవడమే కాకుండా అనుమానాలు నివృత్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ సూచించారు. గురువారం మధ్యాహ్నం న్యుడిల్లి నుండి కేంద్ర ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులతో జిల్లాలలోని రిటర్నింగ్ అధికారి,సహాయ రిటర్నింగ్ అధికారి,సాంకేతిక సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నికల్లో సాంకేతికత మరింత పెరింగిందన్నరు. పారదర్శకత కొరకు సి విజిల్ యాప్ నిర్వహణ,ఈ.ఎస్.ఎం.ఎస్ వంటి యాప్ లతో పాటు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్,సువిధ ద్వారా పారదర్శక నిర్వహణ కోసం ఆన్లైన్ ద్వారా అమలు చేయటం, పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.ఇఎస్ఎంఎస్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ యాప్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీనివల్ల సీజర్ విషయాలు రిపీట్ కాకుండా ఉండటానికి దోహద పడుతుందన్నారు.సి విజిల్, ఎంకోర్,సువిధా వంటి యాప్ ల పై సాంకేతిక సిబ్బందికి,రిటర్నింగ్ అధికారి సహాయ రిటర్నింగ్ అధికారుల కు శిక్షణ ఇచ్చి అనుమానాల నివృత్తి చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలియన్ టీం ద్వారా సీజ్ చేసిన సీజింగ్ అమౌంట్ ను క్లియర్ చేయటం, ఫిర్యాదులు మళ్ళీ మళ్ళీ రిపీట్ కాకుండా యాప్ ను ఆదునికరించటం జరిగింది. నిపుణులు ఇస్తున్న శిక్షణ ను జిల్లాలోని సాంకేతిక సిబ్బంది క్షుణ్ణంగా ఆకళింపు చేసుకొని పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. న్యూ ఢిల్లీ నుండి సంతోష్ పోతారియా సౌరబ్ రాయ్ ఆన్లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. నాగర్ కర్నూల్ నుండి అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ రెవిన్యూ కే సీతారామారావు పిడి డిఆర్డిఏ ఓబులేసు ఇతర సాంకేతిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## బంజారాల ఆరాధ్య దైవం సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్

◆ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

◆ వనపర్తిలో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి.శ్రీనివాస్ జగత్‌పల్లి):**

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సద్గురు శ్రీ సేవాలాల్ మహారాజ్ అని ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి అన్నారు. సేవాలాల్ 285వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం గిరిజన భవన్ లో ఘనంగా నిర్వహించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ల నేతృత్వంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి భోగ్ బండార్ (యజ్ఞంం హెూమం) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గం ప్రతి ఒక్కరికి ఆచరణీయం కావాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారాలకు ఒక గురువుగా సన్మార్గంలో పయనించేందుకు దిశానిర్దేశం చేశారన్నారు. అబద్ధాలు ఆడవద్దు జీవహింస చేయొద్దు మత్తు పానీయాలు సేవించరాదు విద్యాబుద్ధులు నేర్చుకోవాలి గోవులను పోషించాలి అనే సూక్తులను ఆయన వారికి హితబోధ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే ప్రైవేట్ గన్‌మెన్ గృహప్రవేశంలో వనపర్తి నేతలు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి.శ్రీనివాస్ జగత్ పల్లి):**

వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డికి మొదటి నుంచి ప్రైవేట్ గన్ మెన్ గా వ్యవహరిస్తున్న (మాజీ సైనికుడు) రఘువర్ధన్ గౌడ్ గృహప్రవేశానికి పలువురు వనపర్తి నేతలు హాజరయ్యారు. పెబ్బేరు పట్టణంలో నూతనంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన వనపర్తి నేతలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి పెద్దమందడి ఎంపీపీ రఘు ప్రసాద్ కౌన్సిలర్లు వెంకటేష్ బ్రహ్మం చారి నాయకులు యాపర్ల రామ్ రెడ్డి జర్నలిస్ట్ శ్రీనివాస్ యాదవ్ నాగవరం దీపక్ ఎమ్మెల్యే పిఆర్ఓ గోపాల్ పిఎ కిషన్ నాయక్ వెల్టూర్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# కిరాతక భర్త

◆ డబ్బుల కోసమే మా నాన్న మా అమ్మని చంపాడంటున్న కన్న బిడ్డలు

◆ పరారీలో ఉన్న నిందితుడు





**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ ఫిబ్రవరి 15**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన గురువారం నాడు చోటు చేసుకుంది. హౌసింగ్ బోర్డ్ కాలనీలో గత కొంతకాలంగా నివాసం ఉంటున్న దంపతులు శ్రీనివాసు(55) ,ఇందిర(50) ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు.గత నెల రోజులుగా వీరిద్దరి మధ్య డబ్బు కోసం తగాదాలు జరుగుతూన్నాయి. భార్య దగ్గర ఉన్న పూర్తి డబ్బులు భర్త జల్సాల కోసం వాడుకోవడంతో ఆగ్రహించిన భార్య భర్తనుమందలించింది. నన్నే మందలిస్తా అని కోపం తో ఊగిపోయిన భర్త గొడ్డలితో భార్యని హతమార్చారు. చనిపోయిన భార్యను శవాన్ని ఇంట్లో ఉంచ్చి తాళం వేసి హైదరాబాదులోని కూతురు ఇంటికి వెళ్ళాడు శ్రీనివాస్ , కూతురు అమ్మ రాలేదని అమ్మకు ఫోన్ చేస్తుండగా రెండు రోజులైనా ఫోన్లో లిఫ్ట్ చేయకపోవడంపై అనుమానంతో నాగర్ కర్నూల్ లో ఇంటికి వచ్చి చూడగా తల్లి శవమై కనబడింది ,కూతురు తల్లి శవాన్ని చూసిన వెంటనే తండ్రి అక్కడి నుండి పరారైనాడు...పరారైన శ్రీనివాస్ ని పోలీసులు కల్వకుర్తి లో పట్టుకొని పోలీసు స్టేషన్ కి తీసుకొచ్చి విచారిస్తున్నారు.



## నాగర్ కర్నూల్ స్వేరోస్ నెట్వర్క్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

◆ జిల్లా అధ్యక్షుడిగా బండమీది కృష్ణ

◆ ప్రధాన కార్యదర్శిగా విజయ్ చందర్

**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ :ఫిబ్రవరి 15:**

స్వేరో నెట్వర్క్ నాగర్ కర్నూల్ జిల్లా నూతన కమిటీని గురువారం కొల్లాపూర్ చౌరస్తా ఒక ప్రైవేట్ భవనంలో జోగులంబ గద్వాల జోనల్ అధ్యక్షులు గడ్డం గిద్ద విజయ్ కుమార్ స్వేరో అధ్యక్షతన నిర్వహించిన కమిటీ సమావేశానికి స్వేరో నెట్వర్క్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వీరయ్య స్వేరో,సీనియర్ రిసోర్స్ పర్సన్ ఆరెకంటి మల్లయ్య ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. స్వేరో నెట్వర్క్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా బండమీది కృష్ణ,ప్రధాన కార్యదర్శిగా విజయ్ చందర్,ఉపాధ్యక్షులుగా పరమేష్,జాయింట్ సెక్రటరీ శంకర్ నాయక్,కోశాధికారిగా అశోక్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ సత్యం,రాము, రామస్వామి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వేరో నెట్వర్క్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వీరయ్య స్వేరో మాట్లాడుతూ స్వేరో నెట్వర్క్ లోని అక్షరం, ఆర్థికం,ఆరోగ్యం ఈ నిధానాన్ని విద్యార్థి ప్రజల్లోకి కుల మత వర్గ ప్రాంత భేదాలు లేకుండా పనిచేసే భవిష్యత్తులో సమాజ మార్పు అంటేనే స్వేరో నెట్వర్క్ అనే విధంగా పనిచేయాలని జిల్లా కమిటీకి ఆయన సూచించారు. మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యం చేస్తూ అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు స్వేరో నెట్వర్క్ విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యక్షుడు లక్నాపురం, శ్రీనివాసులు,స్వేరో జోనల్,ప్రధాన కార్యదర్శి బోడ వెంకటేష్,స్వేరో శివశంకర్ స్వేరో తదితర స్వేరో నాయకులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సై మధు బాబును మర్యాదపూర్వకంగా కలసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు





**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు ఫిబ్రవరి 15:**

బోనకల్ మండల నూతన ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన కడగండ్ల మధుబాబును గురువారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధుబాబు మాట్లాడుతూ మండలంలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్ కు వచ్చేదారులకు సమన్యాయం అందిస్తానని తెలిపారు సమస్యలు పరిష్కరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించడానికి కృషి చేస్తానని అలాగే మండల మీడియా ప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు (ప్రజా జ్యోతి) డేగల వేలాద్రి, (తెలంగాణ ఎక్స్ప్రెస్)కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, (నేటి శుభోదయం) గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్, (ట్రెప్స్ ఆఫ్ వార్త) వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బడే, (మనం) సహాయ కార్యదర్శి మందా సత్యానందం, (ప్రభా న్యూస్) కోశాధికారి షేక్ బాజీ షరీఫ్, (వాస్తవ నేస్తం) సభ్యులు,షేక్ పెంట్ సాహెబ్, (పోలీస్ నిఘ) మరసకట్ల సంజీవరావు, (జనసముద్రం) షేక్ మదర్ సాహెబ్, (ఫోకస్ టీవీ) మాగి ముఖేష్, (అక్షర శకం) నాగటి రాజశేఖర్, (మన నేటి తెలంగాణ) దారెల్లి రాకేష్ పాల్గొన్నారు.

## పెద్దమందడి ఎంపీపీగా సద్గుణ బాధ్యతల స్వీకరణ

**పెద్దమందడి (నేడు ఫోకస్ న్యూస్):**

పెద్దమందడి ఎంపీపీగా సద్గుణ గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసే అఫ్జలుద్దీన్ సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లగా నారాయణపేట జిల్లా నుండి వచ్చిన సద్గుణ ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ కార్యాలయ సిబ్బందితోపాటు ఉపాధి హామీ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు ఆమెకు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.



## ఘనంగా బొమ్మగాని ధర్మ బిక్షం జయంతి

### గీత పనివార్ల సంఘం జిల్లా నాయకులు బంధం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు ఫిబ్రవరి 15:**

మాజీ పార్లమెంటు సభ్యులు,స్వతంత్ర సమరయోధుడు,అఖిల భారత గీత పనివార్ల కార్మిక సమైక్య ఫౌండర్ కామ్రేడ్ బొమ్మ గాని ధర్మభిక్షం102 వ జయంతి వేడుకలు ముస్టికుంట్ల గ్రామంలో గీత పనివార్ల సంఘం జిల్లా నాయకులు బంధం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా గీత పని వారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దూసరి శ్రీరాములు గౌడ్ గారి ఆధ్వర్యంలో బోమ్మగాని ధర్మభిక్షం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు గౌడ్ మాట్లాడుతూ...బొమ్మగాని ధర్మభిక్షం జయంతి ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం లో బొమ్మగాని ఎన్నో అవమానాలు పడి, ఎంతో మంది పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన కూడా రాష్ట్రం కోసం పోరాడి జైలు జీవితం చేశారన్నారు. నాడు నవాబు చేసిన ఇబ్బందులను తట్టుకొని పోరాటం చేసిన అమర వీరుడు బొమ్మగాని ధరం భిక్షం అని కొనియాడారు. పేద పిల్లలకోసం సొంత ఖర్చులతో పలు హాస్టల్స్ ఏర్పాటు చేసిన ఘనత బొమ్మగానిదని కొనియాడారు. అనంతరం సంఘ జిల్లా నాయకులు పరస గాని లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో ఆయన జయంతిని అధికారకంగా నిర్వహించాలని, బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహం ను ఖమ్మం నగరంలో ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని సంగం తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముష్టికుంట్ల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా డి.గాయత్రి బాధ్యతల స్వీకరణ

**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ ఫిబ్రవరి 15**



నాగర్ కర్నూలు జిల్లా నూతన మద్య నిషేధం, ఆబ్కారీ అధికారిగా డి. గాయత్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఆమె కలెక్టరేట్లోని తన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. డి గాయత్రి ఇంతవరకు వికారాబాద్ జిల్లా మద్యనిషేధం, ఆబ్కారీ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో పనిచేసిన జిల్లా మద్యనిషేధం, ఆబ్కారీ శాఖ అధికారి షేక్ ఫయాజుద్దీన్ మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నాగర్ కర్నూల్ మున్సిపల్ నూతన కమిషనర్ నరేష్ బాబు గురువారం జిల్లా కలెక్టర్ ను కలిసి పుష్పగుచ్ఛన్ని అందజేశారు.



## బీచుపల్లి బెటాలియన్‌లో పోలీసులకు ఫైరింగ్ ప్రాక్టీస్

◆ ఏకే 47 రైఫిల్‌తో ఫైరింగ్ చేసిన ఎస్పీ రక్షిత కే.మూర్తి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి. శ్రీనివాస్ జగత్ పల్లి):**

బీచుపల్లి బెటాలియన్ ప్రాంగణంలో వనపర్తి జిల్లా పోలీసులకు బుధవారం ఫైరింగ్ ప్రాక్టీస్ చేయించినట్లు జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ లో భాగంగా %ూఖ 47, 9 వీవీ% పిస్టల్, 9%వీవీ% కార్బన్, ఎస్ ఎల్ ఆర్ ఇన్సాస్ వెపన్స్ తో ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో డిఎస్పి ఆనంద్ రెడ్డి వనపర్తి సీఐ నాగభూషణరావు, కొత్తకోట సీఐ రత్నం, ఆత్మకూర్ సిఐ శివకుమార్, సాయుధ దళాల ఆర్ ఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రవిపాల్, జిల్లాలోని ఎస్ఐలు ఆర్ఎస్ఐలు సుమారు 426 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు





**మిర్యాలగూడ (నేటి ఫోకస్‌న్యూస్)-ఫిబ్రవరి 15:**

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ ఆశయాలను గిరిజనులు ఆదర్శంగా తీసుకోవాలని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు పిలుపునిచ్చారు, మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆద్వర్యంలో మహాభోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిధులుగా మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ లంబాడీల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ ఒకరని, కులదైవంగా భావించి ప్రతి ఒక్కరు ఆరాధిస్తారని తెలిపారు. ఆయన సేవా మార్గంలో ప్రతి ఒక్క గిరిజనుడు నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కే.సీ.ఆర్ ప్రభుత్వ హయంలో అన్ని వర్గాల మనోభావాలను గుర్తించి ఆయా వర్గాలకు సముచిత్త స్థానం కల్పించిందని తెలిపారు. బీ.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించి వారిని ఘనంగా గౌరవించుకున్నాం అని తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణ నడిబొడ్డున 1 కోటి 20 లక్షల రూపాయలతో సంత్ సేవలాల్ భవనాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దామరచర్ల జడ్పీటీసీ అంగోతు లలిత హాతీరాం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిట్టిబాబు నాయక్, ఎం.పీ.టీ.సీ వీర నాయక్, కుర్ర కాంతి, మండల విద్యాధికారి బాలాజీ నాయక్, తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్ర కృష్ణకాంత్ నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బానవత్ సైదులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మూడ్ తిరుపతి నాయక్, గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు ధర్మా నాయక్, వెంకన్నా నాయక్, రవి నాయక్, ఉద్యోగులు భీమ్లు నాయక్, బాబు సింగ్ నాయక్, నాణిక్య నాయక్, సేవియా నాయక్, కృష్ణ నాయక్, ఉప్పల శ్రీనివాస్, కిరణ్ కుమార్ రెడ్డి, గుండా శ్రీనివాస్, సతీష్, రాజు, శ్రీకాంత్, వెంకన్న, హేమానాయక్, హరి నాయక్, విద్యచందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# ఊరిపేరు భైరవకోన సినిమాకు తొలగిన అడ్డంకులు..




**సందీప్ కిషన్ హీరోగా** వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన "ఊరు పేరు భైరవకోన" సినిమా విడుదలను నిలుపుదల చేయాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో విశాఖపట్నంకు చెందిన ప్రముఖ ఫిలిం డిస్ట్రిబ్యూటర్ బత్తుల సత్యనారాయణ (వైజాగ్ సతీష్) కేసు వేసిన సంగతి తెలిసిందే. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్, ఎ.కె.ఎంటర్ టైన్మెంట్స్ అధినేతలు, ప్రముఖ నిర్మాతలు అనిల్ సుంకర, గరికపాటి కృష్ణ కిషోర్ తనను నమ్మించి మోసం చేశారని బత్తుల సత్యనారాయణ (సతీష్, వైజాగ్ ) అందులో పేర్కొన్నారు. ఆ మధ్య వచ్చిన "ఏజెంట్ సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులు మూడు రాష్ట్రాలు అయిన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటకలకు ఐదు సంవత్సరాల పాటు తనకు చెందిన గాయత్రి దేవి ఫిలిమ్స్ కు అందజేస్తామని అగ్రిమెంట్ నాకు రాసిచ్చి, తన వద్ద నుంచి 30 కోట్ల రూపాయలు తీసుకుని, అగ్రిమెంట్ ప్రకారం హక్కులు ఇవ్వకుండా వారు మోసగించారని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాలకు కాకుండా కేవలం విశాఖపట్నం జిల్లా వరకు మాత్రమే హక్కులు ఇచ్చారని, ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో తదుపరి సినిమా విడుదలకు ముందు నా డబ్బులు చెల్లిస్తామని, లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ ఇచ్చి కూడా వారు సమాధానం చెప్పడం లేదని అన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నేను న్యాయం కోసం కోర్టుకు ఎక్కానని చెప్పారు. తన డబ్బులు ఇచ్చేంతవరకు సినిమా విడుదల కాకుండా స్టే విధించాలని కోరుతూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో గురువారం వాదనలు జరిగాయి. ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు న్యాయమూర్తి సినిమా మీద స్టే విధించే కేసును ఏప్రిల్ 12కి వేశారు. దీంతో ఇప్పటివరకు సినిమాకు ఉన్న అడ్డంకులు తొలగినట్టు అయింది.

# ఫీమేల్ ఓరియంటెడ్‌లకూ సీక్వెల్స్ సిద్ధం



ఇండస్ట్రీలో వంద కోట్ల స్టామినా మేల్ ఓరియంటెడ్ కమర్షియల్ లకే ఉంటుందా? అంటే, వెంటనే యస్ అనే మాట వినిపిస్తుంది. స్టోరీలో సత్తా ఉంటే, ఫీమేల్ ఓరియంటెడ్ లూ ఆ రేంజ్‌లో కలెక్ట్ చేయొచ్చని అంటున్నారు ట్రేడ్ పండిట్స్. కథల మీదా, కమర్షియల్ సక్సెస్ మీద, ప్రేక్షకాదరణ మీదా ఉన్న నమ్మకంతోనే ఫీమేల్ ఓరియంటెడ్ లకూ సీక్వెల్స్ సిద్ధం చేయడానికి మేకర్స్ ముందుకొస్తున్నారన్నది వారి మాట. భామా కలాపం చూసిన వారందరూ ఎక్సలెంట్ రైటింగ్ అని మెచ్చుకున్నారు. ప్రియమణికి టైలర్ మేడ్ కేరక్టర్ అన్నారు. అందుకే ఆహా ఓటీటీలో అద్భుతమైన సక్సెస్ అందుకుంది భామా కలాపం. ఆ కు వచ్చిన స్పందన చూసిన మేకర్స్ వెంటనే సీక్వెల్ మీద ఫోకస్ చేశారు. బామా కలాపం2 ఇప్పుడు ట్రెండింగ్ టాపిక్. ప్రమోషనల్ కంటెంట్‌లో ప్రతి డైలాగూ ఎంటర్‌టైనింగ్‌గా ఉంది... ఆహాలో ఈ నెల 16న విడుదల కానుంది బామా కలాపం2. అంజలి హీరోయిన్‌గా నటించిన గీతాంజలి. హారర్ జోనర్‌లో ఈ అప్పట్లో పెద్ద విజయాన్ని అందుకుంది. ఇప్పుడు అదే జోనర్‌ని కంటిన్యూ చేస్తూ ఆమె నటిస్తున్న గీతాంజలి మళ్లీ వచ్చింది. ఈ సారి ఈ కథలో ఇంకేం ఎలిమెంట్స్ ని పొందుపరుస్తారోననే ఆసక్తి ఈ జోనర్ లవర్స్ లో బాగానే కనిపిస్తోంది. ఈ మధ్య రీఎంట్రీలో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టితో మంచి హిట్ అందుకున్నారు అనుష్క. ఆమె నటించిన భాగమతికి సీక్వెల్ చేస్తామని ఆల్రెడీ ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఓ మలయాళ షూటింగ్‌లో ఉన్నారు అనుష్క శెట్టి. అది పూర్తికాగానే భాగమతి ప్రాజెక్టులో ఇన్వాల్వ్ అవుతారన్నది ఫిల్మ్ నగర్ న్యూస్. ఇటు సమంత కూడా ఫ్యామిలీమేన్3కి ప్రిపేర్ అవుతున్నారు. వెబ్ సీరీస్ పరంగానే కాదు, పరంగానూ ఆమె ఖాతాలో ఓ సీక్వెల్ ఉంది. మయోసైటిస్ సోకడానికి ముందు ఆమె నటించిన యశోద. సీక్వెల్ చేసే ఆలోచనలున్నాయని గతంలో మేకర్స్ హింట్ ఇచ్చారు. ఇప్పుడు సమంత కమ్‌బ్యాక్ టైమ్‌లో ఆ ప్రాజెక్టు మీద కూడా హోప్స్ పెంచుకుంటున్నారు సామ్ ఫ్యాన్స్.

# ఓటీటీలోకి వచ్చేసిన షారూక్ ఖాన్ డంకీ




**పఠాన్, జవాన్ వంటి** బ్లాక్‌బస్టర్స్ తర్వాత బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుఖ్ ఖాన్ నటించిన సినిమా 'డంకీ'. రాజ్ కుమార్ హిరానీ తెరకెక్కించిన ఈ చిత్రం తాప్సీ పొన్ను హీరోయిన్‌గా నటించగా.. విక్కీ కౌశల్, బొమన్ ఇరానీ ప్రధాన పాత్రల్లో నటించారు. గతేడాదిలో ప్రభాస్ 'సలార్'కు పోటీగా డిసెంబర్ 21న డంకీ విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన డంకీ బాక్సాఫీస్ వద్ద పర్వాలేదు అనిపించినా.. పఠాన్, జవాన్ చిత్రాల రేంజ్‌లో మెప్పించలేకపోయింది. రూ. 470 కోట్ల కలెక్షన్స్ వద్ద డంకీ ఆగిపోయింది. అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న ఈ చిత్రం సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. డంకీ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. నిజానికి ఈ సినిమా జనవరిలోనే ఓటీటీలోకి రావాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే.. నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి తెచ్చింది. గురువారం (ఫిబ్రవరి 15) అర్ధరాత్రి నుంచి డంకీ సినిమా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చేసింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన కొద్ది గంటల్లోనే నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ మూవీస్ లిస్ట్‌లో ఈ సినిమా చేరడం విశేషం.నెట్‌ఫ్లిక్స్‌లో టాలీవుడ్ సినిమాలు సలార్, గుంటూరు కారం, హాయ్ నాన్న టాప్ టెన్‌లో కొనసాగుతున్నాయి. ఇప్పుడు డంకీ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేస్తుందో చూడాలి. డంకీ సినిమా ప్రపంచవ్యాప్తంగా కేవలం హిందీలోనే విడుదల అయింది. ఇప్పుడు కూడా హిందీలోనే స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చేసింది. అయితే ఇంగ్లిష్ సబ్ టైటిల్స్‌తో ఆడియెన్స్ చూడొచ్చు.

# ఓటీటీలోకి రాబోతున్న ఎమోషనల్ లవ్‌స్టోరీ




**మణికందన్, శ్రీ గౌరిప్రియ** హీరోహీరోయిన్లుగా నటించిన లేటెస్ట్ మూవీ ట్రూ లవర్..ఈ చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించాడు. తమిళంలో లవర్ పేరుతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీని తెలుగులో ట్రూ లవర్‌గా డైరెక్టర్ మారుతి మరియు బేబీ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ కలిసి రిలీజ్ చేశారు.యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ ఈ మూవీని తెరకెక్కించాడు. కాలేజీ రోజుల నుంచి అరుణ్ (మణికందన్), దివ్య (శ్రీగౌరిప్రియ) ప్రేమించుకుంటారు. ప్రతి విషయంలో దివ్యను అనుమానిస్తుంటాడు అరుణ్. ఆమె మరొకరితో క్లోజ్‌గా మాట్లాడినా అస్సలు సహించలేడు. అరుణ్ ప్రవర్తనకు విసిగిపోయిన దివ్య అతడికి బ్రేకప్ చెప్పాల ని ఎన్నోసార్లు అనుకుంటుంది. దివ్య తన ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్లిన ఓ టూర్‌కు ఆమె వెంట అరుణ్ కూడా వెళతాడు.. అక్కడ ఏం జరిగింది.. అరుణ్‌లో మార్పు వచ్చిందా.. దివ్య ప్రేమను అర్థం చేసుకున్నా డా.. అన్నదే ఈ మూవీ కథ. అపనమ్మకం అభద్రతా భావం తో కూడిన ఏ ప్రేమ నిలబడదనే పాయింట్‌తో దర్శకుడు ప్రభు రామ్ వ్యాస్ ఈ సినిమాను తెరకెక్కించాడు. ట్రైలర్ టీజర్స్‌తో ఈ మూవీ తెలుగు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ కలిగించింది. కానీ కథలో కొత్తదనం లేకపోవడంతో బాక్సాఫీస్ వద్ద పెద్దగా సందడి చేయలేకపోయింది. తమిళంలో మాత్రం డీసెంట్ కలెక్షన్స్ రాబడుతోంది. తమిళంలో లవర్ మూవీ రజనీ కాంత్ లాల్ సలామ్ కలెక్షన్స్ ను బీట్ చేసింది. ఆరు రోజుల్లో ఈ మూవీ పది కోట్ల వరకు గ్రాస్, నాలుగున్నర కోట్ల షేర్‌ను రాబట్టినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం.. ట్రూ లవర్‌లో నటిం చిన శ్రీ గౌరిప్రియ తెలుగు అమ్మాయి కావడం విశేషం. ఈ భామ వైజయంతీ మూవీస్‌లో వచ్చిన 'మెయిల్ 'మూవీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఇటీవలే ఈ భామ మ్యాడ్ మూవీతో తెలుగులో పెద్ద హిట్ అందుకున్నది. ఇదిలా ఉంటే ట్రూ లవర్ మూవీ థియేటర్లలో రిలీజైన నెల రోజుల్లోనే ఓటీటీలోకి రాబోతున్నట్లు తెలుస్తోంది.